

నేటి నుంచి నవమి ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: నగరంలోని శ్రీకోదండరామ స్వామివారి ఆలయంలో గురువారం నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి.



వరసిద్ధుని ఆదాయం రూ.1.29కోట్లు

యాదమరి: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వా మి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా 21 రోజులకు రూ.1.29కోట్ల ఆదాయం వచ్చినట్లు చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు.



నేడు పెంచలకోనలో క్షేత్రోత్సవం

రాపూరు: జిల్లాలోని ప్రముఖ పెంచలకోన క్షేత్రంలో గురువారం శ్రీరామనవమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, క్షేత్రోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం(సా)	సహర్ శుక్రవారం(ఉ)
తిరుపతి	6.27	4.50
చిత్తూరు	6.30	4.49
పుంగనూరు	6.31	4.53

న్యూస్‌రీల్

అర్ధగిరి ఆలయ హుండీ లెక్కింపు



తవణంపల్లె : అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. కానుకల ద్వారా రూ.12,18,724లు ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఈఓ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. దేవదాయశాఖ అధికారి కె.కమలాకర్, పంచాయతీ కార్యదర్శి కె. మహేష్, మహిళా పోలీస్ ఎం.ఎన్.గౌరి, సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్ శివానందరెడ్డి పాల్గొన్నారు.

వైద్యసేవలకు నిబంధనలు తప్పనిసరి

చిత్తూరు రూరల్: వైద్యసేవలందించడంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని డీఎంహెచ్ఓ జి. ప్రకాశం ఆదేశించారు. బుధవారం ఆయన వైద్యఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. స్కానింగ్ సెంటర్లు, ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు విధిగా రిజిస్ట్రేషన్ చేసుకునే చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పకడ్బందీగా రికార్డులు నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల కట్టడికి అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

చిత్తశుద్ధితో శాంతిభద్రతల రక్షణ



గౌరవవందనం స్వీకరిస్తున్న కమాండెంట్ మహేష్‌కుమార్

చిత్తూరు అర్బన్: శాంతిభద్రతల పరిరక్షణలో చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని కర్నూలు రేంజ్ హోంగార్డు కమాండెంట్ మహేష్‌కుమార్ తెలిపారు. బుధవారం చిత్తూరులోని హోంగార్డు యూనిట్లను పరిశీలించారు. అనంతరం దర్బార్ పరేడ్ నిర్వహించి హోంగార్డుల గౌరవవందనం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌బీమా, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మెడికల్ క్యాంపులో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. వేసవి నేపథ్యంలో ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీలు మురళీధర్, కృష్ణమోహన్, లక్ష్మణ్‌కుమార్, ఆర్ఐ నీలకంఠేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

'సహిత' విద్యార్థులకు భత్యం

చిత్తూరు కలెక్టరేట్ : సహిత విద్యావిభాగంలోని మొత్తం 1,752 మంది ప్రత్యేక అవసరాల విద్యార్థులకు రూ.45.15లక్షల భత్యం విడుదల చేసినట్లు సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గృహ ఆధారిత విద్యాభత్యం కింద 284 మంది విద్యార్థులకు రూ.8,52,000 రవాణాకు గాను 430 మందికి రూ.12.9లక్షలు, దివ్యాంగ బాలికల ఉపకార వేతనం కింద 741 మందికి రూ.14,82,000 మంజూరు చేశామన్నారు. అలాగే సహాయక భత్యం కింద 297 మందికి గాను రూ.8.91లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు.

ఘనంగా 'నాగస్త్ర-2023'



సినీనటుడు రాజ్ తరుణ్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

కుప్పం : పట్టణంలోని కుప్పం ఇంజినీరింగ్ కళాశాల 22వ వార్షికోత్సవం సందర్భంగా నాగస్త్ర-2023 పేరుతో బుధవారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. సినీనటుడు రాజ్ తరుణ్ ప్రత్యేక అతిథిగా కార్యక్రమానికి హాజరయ్యారు. విద్యార్థులతో కలిసి నృత్యం చేసి అలరించారు. కళాశాల చైర్మన్ బీసీ పనాగరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఇతర రంగాల్లోనూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. తమ కళాశాలకు రాజ్‌తరుణ్ రావడం ఆనందంగా ఉందన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. అలాగే రాజ్‌తరుణ్‌ను ఘనంగా సత్కరించారు. కేఈసీ వైస్ చైర్మన్ సునీల్‌రాజ్, సీఈఓ సాగర్‌రాజ్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు మెగా చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి రోజా



సమావేశానికి హాజరైన మహిళలతో మమేకమైన మంత్రి రోజా



ఆసరా..ఆనందం

పొదుపు మహిళల్లో ఉప్పొంగిన ఆనందం.. 'ఆసరా'గా నిలుస్తున్న ప్రభుత్వంపై అంతులేని అభిమానం.. ఆర్థికంగా చేయూతనందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై వెల్లువెత్తిన కృతజ్ఞతాభావం.. నిత్యం వెన్నంటే ఉంటూ సహకరిస్తున్న మంత్రి రోజాపై అవధులులేని ఆప్యాయతానురాగం.. అనుక్షణం అండదండలందిస్తున్న వైఎస్సార్‌సీపీతో పెనవేసుకున్న అనుబంధం.. అక్కచెల్లమ్మల మోముపై విరబూసిన దరహాసం.. బుధవారం వడమాలపేటలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా మూడోవిడత నగదు పంపిణీ కార్యక్రమంలో ప్రతి ఆడపడుచు వదనంలో ప్రతిబింబించింది. ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్న జగనన్న వెంటే ఉంటామంటూ మహిళాలోకం నినదించింది.

- ఆడపడుచుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం
- ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన
- వైఎస్సార్‌సీపీకే మహిళల మద్దతు
- ఆసరా చెక్కుల పంపిణీలో మంత్రి రోజా

వడమాలపేట : నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తూ.. 31లక్షల ఇంటి పట్టాలను పంపిణీ చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే మహిళలు మద్దతుగా నిలుస్తారని, జగనన్న వెంటే జనం నడుస్తున్నారని మంత్రి రోజా స్పష్టం చేశారు. బుధవారం వడమాలపేటలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా మూడోవిడత చెక్కుల పంపిణీలో ఆమె పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలను నాలుగువిడతల్లో మాఫీ చేస్తున్నారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ఆడపడుచుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టినా మహిళలనే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తోందని వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని, ప్రజా సంక్షేమమే పరమావధిగా ముందుకు సాగుతున్నామని వివరించారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా, అవినీతికి తావులేకుండా, పారదర్శకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. విప్లవాత్మకమైన పథకాలతో దేశానికే దిశానిర్దేశం చేస్తున్నారని చెప్పారు. జనం ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలను అందిస్తున్నారన్నారు. పేదలకు మేలు జరిగితే చంద్రబాబు ఓర్వలేరని, అందుకే అసత్య ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. ఎల్లో మీడియా సహకారంతో ప్రభుత్వంపై కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వెన్నుపోటు రాజకీయాలకు తెరతీసిన చంద్రబాబుకు ప్రజలే గుణపాఠం చెబుతారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజాబలం ఉందని, ఎవరు ఎన్ని కుతంత్రాలు పన్నినా ఏం చేయలేరని స్పష్టం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేయడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. మేలు చేసిన ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నటికీ మరచిపోరని, సరైన సమయంలో .. సరైన నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. కుట్ర రాజకీయాలతో మనుగడ సాగించాలనుకునే టీడీపీ నేతలకు పరాజయం తప్పదని తెలిపారు. ప్రజాసేవకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్న జగనన్నకు జనంతోపాటు దేవుడు సైతం అండగా ఉంటాడని వెల్లడించారు. అనంతరం కేక్ కట్ చేసి, ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం రామసముద్రంలో వాటర్ ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించారు. ఎప్పుడు ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పాలసముద్రం : మండలంలోని వెంగళరాజుకుప్పం సచివాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం డ్వాక్రా సంఘాల సభ్యులు క్షీరాభిషేకం నిర్వహించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తున్న జగనన్న రుణం తీర్చుకోలేమని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ పుష్ప, సర్పంచ్ లిల్లీ, సీసీ చిరంజీవి పాల్గొన్నారు

ఎస్సీ..ఎస్టీల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్, పక్కన మేయర్ అముద, ఏఎస్పీ జగదీష్

సాక్షి, చిత్తూరు : ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని మేయర్ అముద తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమశాఖ అధ్వర్యంలో జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఎస్సీ,ఎస్టీలు బలోపేతం కావాలని సూచించారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీలు, ఎస్టీల కోసం 300 శ్మశానవాటికలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దళితుల సమస్యల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ విషయంలో అధికారులు సైతం ఏమాత్రం అలసత్వం వహించకూడదని స్పష్టం చేశారు. భూ పంపిణీకి అర్హులైనవారి వివరాలను సేకరించి వారికి పట్టాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఏఎస్పీ జగదీష్ అట్రాసిటీ కేసుల పురోగతిని వివరించారు. సాంఘిక సంక్షేమశాఖ డీడీ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పన్ను చెల్లింపునకు రేపే ఆఖరు

చిత్తూరు అర్బన్: కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను చెల్లింపునకు ఈనెల 31వ తేదీతో గడువు ముగుస్తోంది. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద నిర్దేశిత గడువులో పన్ను మొత్తం చెల్లించేవాళ్లకు వడ్డీ మాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఈ మేరకు ఇప్పటికే చిత్తూరు కార్పొరేషన్‌కు దాదాపు రూ.26 కోట్లు ఆస్తిపన్ను రూపంలో వసూలైంది. పలమనేరు, పుంగనూరు, కుప్పం, నగరి, పుత్తూరు మున్సిపాలిటీలు సుమారు రూ.14 కోట్లకు పైగా పన్నులు వసూలు చేశాయి. మిగిలిన రెండు రోజుల్లో బకాయిలు రాబట్టడానికి కమిషనర్లు చర్యలు చేపడుతున్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి బకాయిలపై వడ్డీ పడిపోతుందని, ప్రజలు ముందస్తుగా పన్ను చెల్లించి వడ్డీ మాఫీ పొందాలని కోరుతున్నారు.

వేడుకగా ఆరుద్ర పూజలు



ఊరందూరుకు బయలుదేరుతున్న స్వామి,అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని బుధవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి,అమ్మవార్లు మండలంలోని ఊరందూరులో వెలసిన శ్రీనీలకంఠేశ్వర స్వామి ఆలయానికి బయలుదేరారు. అందులో భాగంగా ఉదయం శ్రీస్వామి,అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ స్వామి, అమ్మవార్లను చప్పరాలపై అధిష్ఠింపజేశారు. అనంతరం ఊరేగింపుగా స్వామి, అమ్మవార్లు ఊరందూరు నీలకంఠేశ్వరాలయానికి చేరుకున్నారు. అక్కడ పూజల అనంతరం పానగల్, అగ్రహారం, సన్నిధివీధి, మాడవీధుల గుండా ఆలయానికి వేంచేపు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఈవో సాగర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

9మంది ఎస్ఐల బదిలీ

చిత్తూరు అర్బన్: జిల్లాలోని 9 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ రిశాంత్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బీఎస్ఆర్‌పేట ఎస్ఐ ప్రతాప్‌రెడ్డిని గంగవరం, నింద్ర ఎస్ఐ వెంకటసుబ్బమ్మను బీఎస్ఆర్‌పేట, గంగవరం ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డిని తవణంపల్లె, ఇక్కడ పనిచేస్తున్న ప్రసాద్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. చిత్తూరు టూటౌన్ ఎస్ఐ మల్లికార్జునను డీటీసీకి, పలమనేరు ఎస్ఐ నాగరాజును చిత్తూరు టూటౌన్‌కు, వీఆర్‌లోని లోకేష్‌ను వెదురుకుప్పం, చిత్తూరు పీసీఆర్‌లో ఉన్న రమణను చిత్తూరు సీసీఎస్‌కు, బైరెడ్డిపల్లె ఎస్ఐ వెంకట నరసింహులును సోమలకు బదిలీ చేశారు.

బురదచల్లేందుకే ఆరోపణలు



డీసీహెచ్‌ఎస్‌తో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్

- కుప్పం ఆస్పత్రిపై ఫిర్యాదులు హాస్యాస్పదం
- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్

కుప్పం : ప్రభుత్వంపై బురదచల్లేందుకే కుప్పం వంద పడకల ఆస్పత్రిపై ఆరోపణలు చేస్తున్నారని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్ మండిపడ్డారు. బుధవారం కుప్పం ఆస్పత్రిలో విచారణ చేపట్టిన డీసీహెచ్ఎస్ బీసీ నాయక్‌తో వారు మాట్లాడారు. ఏ గ్రేడ్ వచ్చిన ఆస్పత్రిపై ఫిర్యాదు చేయడం హాస్యాస్పదమన్నారు. హాస్పిటల్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే చంద్రబాబే అని, ఆయనే ఆస్పత్రిలో సక్రమంగా సేవలందించడంలేదని లేఖలు రాయడం సమంజసం కాదన్నారు. నాడు-నేడు కింద రూ.కోట్లు వెచ్చించి ఆస్పత్రిని అభివృద్ధి చేస్తుంటే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. వంద పడకల ఆస్పత్రి అభివృద్ధి పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని, జిల్లా వైద్యశాఖ అధికారులు సహకరించాలన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడమే అందరి లక్ష్యం కావాలని సూచించారు. విచారణను పారదర్శకంగా పూర్తి చేయాలని కోరారు.

సైబర్..డర్!



అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. సెల్‌ఫోన్‌ల కారణంగా ప్రపంచమే అరచేతిలో ఇమిడిపోయింది. మునివేళ్లపైనే సకలం చక్కబెట్టుకునే వెసులుబాటు వచ్చింది. ఈ క్రమంలోనే టెక్నాలజీని దుర్వినియోగం చేసే వ్యవస్థ సైతం రూపుదిద్దుకుంది. మనిషిలోని అత్యాశను అవకాశంగా తీసుకుని సైబర్ నేరాలకు పాల్పడుతోంది. ఆర్థికపరమైన దోపిడీలకు తెరతీస్తూ పోలీసులకు పెను సవాల్ విసురుతోంది. ఈ మేరకు ఢిల్లీలోని లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ దేశంలో సైబర్ క్రైమ్‌లకు హాట్‌స్పాట్‌లుగా మారిన 36 నగరాలను గుర్తించింది. అందులో చిత్తూరు పేరు పేర్కొనడంతో జిల్లా పోలీస్‌శాఖ ఉలిక్కిపడింది. సైబర్ నేరగాళ్లకు చెక్‌పెట్టేందుకు పకడ్బందీగా కసరత్తు చేపడుతోంది.



బీహార్, కర్ణాటకకు చెందిన సైబర్ నేరగాళ్ల అరెస్టు చూపుతున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి (ఫైల్)

అత్యాశతోనే చిక్కులు

బాధితుల ప్రమేయం లేకుండా సైబర్ నేరాలు జరిగే అవకాశం ఉండదు. సాంకేతిక దొంగలు లింకులను స్మార్ట్‌ఫోన్లకు పంపి వాటిని క్లిక్ చేయమని చెప్పడం, ఆధార్ కార్డు- బ్యాంకుఖాతాకు లింకు చేయాలని ఓటీపీ అడగడం, ఆన్‌లైన్‌లో లాటరీ తగిలిందని క్లెయిమ్ చేసుసుకోవాలంటే కొద్దిగా డబ్బులు చెల్లించాలని మాయ మాటలు చెప్పడడం.. ఇలా రకరకాలుగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. వీరి వలలో చిక్కుకుని బాధితులు రూ.లక్షల్లో నగదు పోగొట్టుకుంటున్నారు. మనదికాని డబ్బు, వస్తువులను దక్కించుకోవాలని అత్యాశ పడితేనే చిక్కులు వస్తున్నాయని పోలీస్ శాఖ హెచ్చరిస్తోంది.

- సైబర్ క్రైమ్ హాట్‌స్పాట్‌గా చిత్తూరు
- దేశంలోని 36 నగరాల్లో ఒకటిగా ప్రకటన
- జాతీయ సంస్థల హెచ్చరికతో పోలీసుల అప్రమత్తం
- ఆర్థిక వ్యవస్థపై కుట్రగా భావిస్తున్న కేంద్రం

చిత్తూరు అర్బన్ : జాతీయస్థాయిలో సైబర్‌క్రైమ్స్ అధికంగా జరుగుతున్న నగరాల్లో చిత్తూరు పేరును లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ పేర్కొంది. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో సైతం వైరల్‌గా మారింది. మన రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్నం లాంటి పెద్ద నగరాలు ఉండగా, సైబర్ నేరాలకు చిత్తూరు ఎలా అడ్డాగా మారిందనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి.

చాప కింద నీరులా..!

దేశ ఆర్థిక వ్యవస్థను, జాతీయ భద్రతా గ్రిడ్‌ను నిర్వీర్యం చేయడానికి శత్రుమూకలు చాలాకాలంగా ప్రయత్నం చేస్తున్నాయని, వారి పన్నాగాలను దీటుగా జవాబు ఇస్తున్నామని దర్యాప్తు సంస్థలు పేర్కొంటున్నాయి. ఇదే సమయంలో సైబర్‌క్రైమ్ రోజురోజుకూ చాపకింద నీరులా విస్తరిస్తూపోతోంది. సైబర్ నేరాలను ఇన్వెస్టిగేషన్‌లో జిల్లా పోలీసుశాఖ ఎప్పటికప్పుడు యాక్టివ్‌గా వ్యవహరిస్తోంది. బాధితులు ఎవరైనా స్టేషన్‌కు వస్తే వెంటనే ఫిర్యాదు తీసుకుని కేసులు నమోదుచేస్తోంది. నిందితుల వివరాలను గుర్తించి వాళ్లు దేశంలో ఎక్కడున్నా అరెస్టు చేస్తోతది. ఈ గణాంకాలను ఎప్పటికప్పుడు జాతీయ దర్యాప్తు సంస్థలు నమోదు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే చిత్తూరును సైబర్‌క్రైమ్స్ హాట్‌స్పాట్‌గా పేర్కొన్నట్లు జిల్లా పోలీసుశాఖ స్పష్టం చేస్తోంది. మహా నగరాల్లో అక్కడి జనసాంద్రత, నమోదవుతున్న కేసుల వివరాలు, నిందితుల అరెస్టుపై ఈ గణాంకాలు ప్రభావాన్ని చూపిస్తుండటంతో అవి హాట్‌స్పాట్ జాబితాలో లేవని వివరిస్తున్నాయి.

నేరాల కట్టడికి కృషి

"సైబర్‌క్రైమ్‌లపై కేంద్రం హెచ్చరికలను ప్రత్యేకంగా విశ్లేషిస్తున్నాం. నేరాలను ముందస్తుగా పసిగటివ్ట కట్టడికి కృషి చేస్తాం. ఇప్పటికే జిల్లాలోని 1,132 గ్రామాల్లో సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు నిర్వహించాం. 93 విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశాం. దురదృష్టవశాత్తు ఇలాంటి నేరాల్లో యువతే ఎక్కువగా చిక్కుకుంటున్నారు. సైబర్ క్రైమ్ బాధితులు వెంటనే పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలి. డయల్-100, పోలీసు వాట్సప్-9440900005 నంబర్లకు సమాచారం ఇవ్వాలి. ఈవిషయంలో నిర్లక్ష్యంగా ఉండకూడదు. – రిషాంత్‌రెడ్డి, ఎస్పీ, చిత్తూరు

రహదారుల అభివృద్ధికి ప్రతిపాదన



నితిన్‌గడ్కరీకి ప్రతిపాదన అందిస్తున్న ఎంపీ రెడ్డెప్ప

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో రహదారుల అభివృద్ధి చేయాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ రెడ్డెప్ప ప్రతిపాదన అందజేశారు. బుధవారం ఈ మేరకు ఆయన ఢిల్లీలో కేంద్రమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ చిత్తూరులో కట్టమంచి నుంచి పుత్తూరు రోడ్డును సుమారు 2.5 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేస్తే నగరంలో చాలావరకు ట్రాఫిక్ తగ్గుతుందన్నారు. అలాగే సంతపేట నుంచి కైలాసపురం మీదుగా చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారి వరకు మొత్తం మూడు కిలోమీటర్ల మేర రోడ్డును అభివృద్ధి చేయాలని కోరామని చెప్పారు. అలాగే జిల్లాలో మరికొన్ని రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదనలను అందించామని, కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

'పది' పరీక్షల నిర్వహణపై సమీక్ష



మాట్లాడుతున్న జేసీ వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్ : పదోతరగతి పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం వీడికో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలో పది పరీక్షలకు చేసిన ఏర్పాట్లను జేసీ వెంకటేశ్వర్ వివరించారు. మొత్తం 115 కేంద్రాల్లో 21,996 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు వెల్లడించారు. 11 రూట్‌లకు గాను 22మంది అధికారులను నియమించామన్నారు. ఆరు బృందాలతో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు చెప్పారు. అలాగే ఓపెన్ స్కూల్‌కు సంబంధించి పదో తరగతి, ఇంటర్ పరీక్షలను మొత్తం 4,659 మంది అభ్యర్థులు రాయనున్నట్లు వివరించారు. వీరి కోసం సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రశ్న పత్రాలు, జవాబు పత్రాల తరలింపునకు తగు జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ రాజశేఖర్, డీఈఓ విజయేంద్రరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజలంతా ఆనందంగా ఉండాలి

● ప్రముఖుల శ్రీరామనవమి శుభాకాంక్షలు

తిరుపతిఅర్బన్: జిల్లా ప్రజలందరికీ శ్రీరాముచంద్రుడు తోడుగా ఉండి ఆనందాలు కురిపించాలని మంత్రులు, ప్రముఖులు శ్రీరామ నవమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, చిత్తూరు, తిరుపతి ఎంపీలు రెడ్డెప్ప, గురుమూర్తి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, జేసీ వెంకటేశ్వర్, డీఆర్‌ఓ రాజశేఖర్ వేర్వేరు ప్రకటనల్లో నవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడి కృపతో ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. అలాగే ప్రజలకు సంతోషం, ఆరోగ్యం, పాడి పంటలు, సిరి సంపదలను శ్రీరామచంద్రుడు ప్రసాదించాలని ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆకాక్షించారు. శ్రీరామనవమి వేడుకలను కుటుంబ సమేతంగా ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

బస్సు చార్జీల్లో రాయితీ

చిత్తూరు రూరల్: చిత్తూరు ఆర్టీసీ–2 డిపో నుంచి హైదరబాద్‌కు రాకపోకలు సాగించే ఇంద్ర ఏసీ, స్టార్ లైనర్ స్లీపర్ కోచ్ సర్వీసుల్లో పాత చార్జీలపై 20 శాతం తగ్గించామని డీపీటీఓ జితేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇంద్ర ఏసీలో వేలూరు నుంచి హైదరాబాద్‌కు రూ.1,150, చిత్తూరు నుంచి రాత్రి 8 గంటలకు వెళ్లే బస్సులో రూ.1,090 టికెట్ ధరగా నిర్ణయించామన్నారు. స్టార్ లైనర్ సర్వీసుల్లో రాయితీ పోను రూ.1,140, రూ.1,100లకు టికెట్ ధర ఉంటుందని వివరించారు.



చెరువులే అండ.. అవినీతే నిండా

తిరుపతికి సమీపంలోని వెంకటాపురం చెరువు టీడీపీ హయాం నుంచి ఇద్దరు వ్యక్తుల ఆధీనంలోనే ఉంది. నాడు టీడీపీ నాయకులమని.. నేడు అధికారపార్టీ అని చెప్పుకుంటూ చేపలు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. వారి అక్రమాలను తెలుసుకున్న సొసైటీ సభ్యులు సభ్యత్వాలను రద్దు చేసుకున్నారు. గత ఏడాది జూన్‌తో సొసైటీ గడువు ముగిసినా టెండర్ పిలువకుండా అడ్డుపడుతున్నారు. కొందరు అధికారులను లోబరుచుకుని తమ ఆధీనంలోనే ఉంచుకుంటూ చేపల వేటే ఆదాయంగా జేబులు నింపుకుంటున్నారు. తద్వారా ప్రభుత్వం ఆదాయం కోల్పోతోంది. ఇది ఉదాహరణ మాత్రమే చాలా చెరువులు కొందరి కబంధహస్తాల్లో ఉంటూ మత్స్యకారులకు ఉపాధి లేకుండా పోతోంది.

- సొసైటీల ముసుగులో దోపిడీ
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- 8 నెలల క్రితమే గడువు ముగింపు
- అనుమతులు లేకున్నా చేపల వేట
- ఒకరిద్దరి చేతుల్లో చేపల చెరువులు
- కమీషన్ల కక్కుర్తిలో మత్స్యశాఖ అధికారులు

జిల్లా సమాచారం	
పంచాయతీరాజ్ చెరువులు :	356
మైనర్ ఇరిగేషన్ చెరువులు :	471
సొసైటీలు :	48
సభ్యులు :	2,560

తిరుపతి అర్బన్: జిల్లాలో సొసైటీల ముసుగులో కొందరు అధికారుల సహకారంతో పాతవారే చెరువులపై పెత్తనం చెలాయిస్తున్నారు. 8 నెలల కిందటే సొసైటీలకు గడువు ముగిసినప్పటికీ చెరువులను తమ ఆధీనంలోనే ఉంచుకుంటూ చేపలు పట్టి చెన్నై మార్కెట్‌కు తరలించి జేబులు నింపుకుంటున్నారు. మత్స్యశాఖ అధికారులకు తెలిసినప్పటికీ వ్యాపారులు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తి పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇదే అదునుగా దోపిడీదారులు చెలరేగిపోతున్నారు. ఏటా జూలైలో ఏడాది కాలపరిమితికి పంచాయతీరాజ్ చెరువులతోపాటు మైనర్ ఇరిగేషన్ చెరువులకు టెండర్లు నిర్వహించాల్సి ఉంది. గతే డాది రూ.కోటి మేరకు చెరువుల టెండర్ల ద్వారా ఆదాయం సమకూరింది. ఈ ఏడాది టెండర్లు లేకుండానే పాతవారే ఇష్టారాజ్యంగా చేపలు పట్టి అమ్ముకుంటున్నారు. సాధారణంగా టెండర్ ద్వారా వచ్చే ఆదాయంలో ఆ చెరువు ఆయకట్టుకు 50 శాతం, పంచాయతీలకు 30 శాతం, మత్స్యశాఖకు 20 శాతం చొప్పున టెండర్ మొత్తాన్ని కేటాయించాల్సి ఉంది. అలా చేస్తే తమ జేబులు నిండవని కొందరు మత్స్యశాఖ అధికారులు అడ్డదారిలో చేపలను పట్టుకునేందుకు ప్రోత్సహిస్తున్నట్లు చర్చసాగుతోంది. మత్స్యశాఖ అధికారులు ఇకనైనా స్పందించి చేపల చెరువులకు టెండర్లు నిర్వహించి అసలైన సభ్యులకు న్యాయం చేయాలని సొసైటీ నాయ కులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



టెండర్లు నిర్వహించకుండా సొసైటీ చెరువుల్లో చేపలు పట్టేందుకు వీల్లేదు. గత ఏడాది జూన్ 30వ తేదీ నాటికి సొసైటీల గడువు పూర్తయింది. తిరిగి టెండర్లు నిర్వహిస్తేనే చేపలు పట్టాలి. గడువు ముగిసిన సొసైటీల్లో చేపలు పడుతున్నట్లు మా దృష్టికి రాలేదు. విచారణ చేస్తాం. అవసరమైతే కేసులు పెడుతాం.

–చాంద్‌బాషా, జిల్లా అధికారి, మత్స్యశాఖ

మా చెరువు ఇద్దరు చేతుల్లోనే



వెంకటాపురం చెరువు ఇద్దరు చేతుల్లోనే కొనసాగుతోంది. ఏళ్ల తరబడి వా రే చేపల పెత్తనం చేస్తున్నా రు. ఏటా రూ.లక్షల్లో ఆదాయం పొందుతున్నారు. పేరుకు మాత్రమే సొసైటీ అంటున్నారు. సొసైటీలోని సభ్యులకు ప్రయోజనం చేకూరడంలేదు.

–టి.వెంకటేష్, వెంకటాపురం



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.55,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,400

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,000
రిటైల్ వెండి గ్రాము	రూ.73

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	37	24
తిరుపతి	36	23
తిరుమల	32	20
గూడూరు	38	26
నగరి	37	24

నేడు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తిరుపతి రూరల్: తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలోని అన్ని కార్పొరేషన్లు, మున్సిపల్, మండల, పంచాయతీల్లో గురువారం శ్రీరామనవమి పండుగ సందర్భంగా సెలవు అయినప్పటికీ విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు పనిచేస్తాయని ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ ఎస్‌ఈ కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చెల్లింపు కేంద్రాల్లో విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేర్వేరు చోట్ల అక్రమ మద్యం విక్రేతల అరెస్ట్

కుప్పం : పట్టణంలోని మోడల్ కాలనీ వద్ద బుధవారం నిర్వహించిన కార్డన్‌సెర్చ్‌లో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు అర్బన్ సీఐ శ్రీధర్ తెలిపారు. నిందితులు యానాది పల్లెకు చెందిన మురుగేష్, మోడల్ కాలనీకి చెందిన కృష్ణన్‌గా గుర్తించామన్నారు. వారి నుంచి 198 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

బంగారుపాళెం: మండలంలోని వేపన పల్లెకు చెందిన జగన్నాథం అనే వ్యక్తి ఇంట్లో కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. నిందితుడి నుంచి 20 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. దాడిలో హెడ్‌కానిస్టేబుల్ గజేంద్ర, కానిస్టేబుల్ అజ్గర్ పాల్గొన్నారు.



బంగారుపాళెం: నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఆయుర్వేద కళాశాలకు ఐఎస్‌ఓ సర్టిఫికెట్లు



సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి తుడా: శ్రీవేంకటేశ్వర ఆయుర్వేద వైద్య కళాశాలకు మూడు విభాగాల్లో ఐఎస్‌వో సర్టిఫికెట్లు లభించాయి. టీటీడీ పరిపాలన భవనంలో బుధవారం ఈవో ఏవీ ధర్మారెడ్డి చేతుల మీదుగా ప్రిన్సిపల్ డాక్టర్ మురళీకృష్ణ సర్టిఫికెట్లు అందుకున్నారు. విద్యుత్ పొదుపు, పచ్చదనం పెంపుతో పర్యావరణ పరిరక్షణ, ఉత్తమ విధానాలు అమలు చేస్తున్నందుకు సర్టిఫికెట్లు లభించాయి. ప్రిన్సిపల్ మురళీకృష్ణ, ఇతర అధ్యాపకులు, సిబ్బందిని ఈవో ధర్మారెడ్డి ఈ సందర్భంగా అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుందరం, ఐఎస్‌వో ప్రతినిధులు శివయ్య, మౌళిక ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎస్వీబీసీకి ..

శ్రీవేంకటేశ్వర భక్తి చానల్ నిర్వహణలో ఉత్తమ విధానాలు అమలు చేస్తున్నందుకు గాను ఐఎస్‌వో సర్టిఫికెట్ లభించింది. ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్ కుమార్ ఈవో ధర్మారెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు.

రామోజీ దళిత వ్యతిరేకి

● డిప్యూటీ సీఎం నారాయణ స్వామి



తిరుచానూరు(చంద్రగిరి): ఆది నుంచి ఈనాడు అధినేత రామోజీరావు దళితులకు వ్యతిరేకిగా వ్యవహరిస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మండిపడ్డారు. తిరుచానూరు సమీపంలోని ఓ కార్యక్రమానికి ఆయన హాజరయ్యా రు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. 1984లో పాదిరికుప్పం హరిజనవాడ పూర్తిగా కాంగ్రెస్ పార్టీకి ఓటేసిందనే నెపంతో శ్మశాన వాటికగా కాల్చేశారన్నారు. అప్పట్లో కనీసం సానుభూతి కూడా వ్యక్తపరచలేదన్నారు. కాంగ్రెస్ అంటే రా మోజీరావుకు గిట్టకపోవడంతో అసత్యపు కథనాలు వండివార్చేవారన్నారు. కారంచేడులో ఏడుగురిని హతమారిస్తే కూడా రామోజీ రావు చంద్రబాబుకు వత్తాసు పలికారని ఆరోపించారు. రామచంద్రాపురం మండలంలో 12 గ్రామాల్లోని దళితులకు ఓటు హక్కు లేకుండా అగ్రకులాలు చేస్తే, ఎమ్మెల్యే చెవిరెడ్డి సుప్రీం కోర్టు వరకు వెళ్లి పోరాడి దళితులకు ఓటు హక్కును కల్పించారని గుర్తుచేశారు. రామోజీరావు ఏవిధంగా పైకి ఎదిగారో అందిరికీ తెలుసునన్నారు. మార్గదర్శి అక్రమాలపై విచారణ చేపట్టడంతో రామోజీరావు అవినీతి, స్కిల్ స్కా ములు బయపడితే జీర్ణించుకోలేక కక్షపూరితంగా వార్తలు రాస్తున్నారన్నారని నారాయణస్వామి ఆరోపించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన అభివృద్ధిని కనిపించకుండా చేసి.. చంద్రబాబును గద్దెనెక్కించేందుకు రామోజీరావు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. 14 ఏళ్ల సీఎంగా పనిచేసిన చంద్రబాబు ఎవరైనా ఎస్సీ కులంలో పుట్టాలని కోరుకుంటాడా అన్న మాట కూడా రామోజీరావు కనిపించలేదా అన్నారు.

అచ్చెన్న మాటలపై అనుమానం : మంత్రి రోజా

అచ్చెన్నాయుడు మాట్లాడే మాటలు వింటుంటే అనుమానం కలుగుతోందని మంత్రి రోజా అన్నారు. 40 మంది తనకు టచ్‌లో ఉన్నారని ఆయన అంటుంటే, మీ పార్టీలో 175 సీట్లలో పోటీ చేసేందుకు అభ్యర్థులు లేక టచ్‌లో ఉన్నారా లేక ఎలాగో పార్టీ లేదు బొక్కా లేదన్నారు కదా.. టీడీపీని మూసి వేస్తారని అచెన్న చెప్పిన మాటలు నమ్మి వైఎస్సార్‌సీపీలోకి రావడానికి టచ్‌లో ఉన్నారా అని ఆమె ప్రశ్నించారు. నారా లోకేష్ వార్డు సభ్యుడికి ఎక్కువగా.. ఎమ్మెల్యే తక్కువగా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. వార్తల్లో నిలిచేదాని కోసం ఎమ్మెల్యే, మంత్రులకు కనీసం గౌరవం ఇవ్వకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు.

బైక్ ఢీకొని ఒకరి మృతి

పూతలపట్టు: మండలంలో బుధవారం బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ హరిప్రసాద్ కథనం మేరకు.. కిచ్చెన్నగారిపల్లెకు చెందిన పి.బాలాజీ నాయుడు(50) వ్యక్తిగత పనుల నిమిత్తం పూతలపట్టుకు వచ్చి తిరిగి వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న బైక్ ఢీకొంది. పాపినాయునిపల్లెకు చెందిన మునిరత్నంనాయుడు మద్యం సేవించి బైక్‌పై వస్తూ ఢీకొన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై దాడి: కేసు నమోదు

●పావురాన్ని ట్రాక్టర్‌తో తొక్కించిన ఘటన

నాయుడుపేటటౌన్ : పావురం ట్రాక్టర్ కిందపడి మృతి చెందడంతో ఆగ్రహించిన పెంపకందారులు డ్రైవర్‌పై విచాక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచిన ఘటనపై బుధవారం పోలీసులు కేసు నమో దు చేశారు. పోలీసుల కథనం.. ఈనెల 24 తేదీ మండల పరిధిలోని దరఖాస్తుకండ్రిగ వద్ద రహదారిపై ట్రాక్టర్ వస్తుండగా ఓ పావురం ఎగురుకుంటు వచ్చి ట్రాక్టర్ కిందపడి మృతి చెందింది. గమనించిన దరఖాస్తు కండ్రిగ గ్రామానికి చెందిన పావురాల పెంపకందారులు అన్‌దీప్, వెంకట సా యి, ఆకాష్, నరేష్ మూకుమ్మడిగా ట్రాక్టర్ డ్రైవర్ పురిణి వీరయ్యపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సైబర్ నేరగాడు అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

శాంతిపురం: ఉద్యోగం ఇస్తామని ఫోను ద్వారా నమ్మబలికి, బ్యాంకు అకౌంటులో ఉన్న సొమ్మును మోసపూరితంగా కాజేసిన ఢిల్లీకి చెందిన నిందితుడిని రాళ్లబూదుగూరు పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ మునిస్వామి కథనం మేరకు వివరాలు.. చెంగుబళ్ల పంచాయతీలోని శివకురుబూరుకు చెందిన అమరావతి అనే మహిళ మొబైల్‌కు గత నవంబర్‌లో పార్ట్ టైం, ఫుల్ టైం ఉద్యోగాల పేరిట ఓ ఎస్ఎంఎస్ వచ్చింది. దానిని నమ్మిన ఆమె మెసేజ్‌లోని లింకు ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. దీనిలో భాగంగా ఆమె బ్యాంకు ఖాతా, యూపీఐ వివరాలను సేకరించిన దుండగులు ఆమె ఖాతా నుంచి రూ.1,73,000లను తమ ఖాతాలోకి బదిలీ చేసుకున్నారు. తర్వాత వారి నుంచి స్పందన లేకపోవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన రాళ్లబూదుగూరు పోలీసులు విచారణ ప్రారంభించారు. జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఎస్‌ఐ మునిస్వామి, కుప్పం ఎస్‌ఐ శివకుమార్, గుడుపల్లి ఎస్‌ఐ రామాంజనేయులుతో ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేశారు. పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సాగిన విచారణలో మోసానికి పాల్పడిన వ్యక్తి దేశ రాజధానిలో ఉన్నట్టు గుర్తించారు. ఈనెల 25న అక్కడికి వెళ్లి అక్కడి పోలీసుల సహకారంతో నిందితుడు మోనూను అరెస్టు చేశారు. ఢిల్లీ కోర్టులో హాజరుపరచి, మేజిస్ట్రేటు అనుమతితో బుధవారం రాళ్లబూదుగూరుకు తీసుకువచ్చారు. కుప్పం కోర్టులో హాజరు పరచి మేజిస్ట్రేటు ఆదేశాల మేరకు రిమాండుకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు.

విద్యుత్ చౌర్యంపై 600 కేసులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ముమ్మరంగా తనిఖీలు చేపట్టినట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. విద్యుత్ చౌర్యం, అదనపులోడ్ క్రమబద్ధీకరణ కింద 600 కేసులు నమోదు చేశామన్నారు. ఈ మేరకు రూ.13.73 లక్షలు జరిమానా విధిస్తూ సంబంధిత వినియోగదారులకు నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు.

వివాహిత ఆత్మహత్య

గంగవరం : స్థానిక డ్రైవర్స్ కాలనీలో మంగళవారం రాత్రి ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. కాలనీకి చెందిన అశోక్‌కు తమిళనాడులోని వేలూరు చెందిన నందిని(29)కి మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి భాగ్యలక్ష్మి(2)అనే కూతురు ఉంది. అత్తామామాలతో కలిసి ఉండలేక నందిని తన భర్తతో కలిసి అద్దె ఇంటికి మారింది. ఈ క్రమంలో అశోక్ తాగుడికి బానిసయ్యాడు. మద్యం అలవాటు మానేయాలని చెప్పినా వినేవాడు కాదు. దీంతో అనేక పర్యాయాలు నందిని అలిగి పుట్టింటికి వెళ్లిపోయేది. తర్వాత భార్యకు నచ్చజెప్పి తీసుకువచ్చేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి భార్యాభర్తలు ఘర్షణ పడ్డారు. అశోక్ తన కూతురును తీసుకుని తల్లిదండ్రుల ఇంటికి వచ్చేశాడు. మనస్థాపం చెందిన నందిని ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. తిరిగి ఇంటికి వెళ్లిన అశోక్ ఈ విషయం గమనించి కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నందిని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అశోక్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

